నమస్తే తెలంగాణ

కామారెడ్డి

3 | నిజామాబాద్, శుక్రవారం 7 జూన్ 2024 | KAMAREDDY




కందకుర్తిలో విద్యార్థుల తల్లిదండ్రులకు నచ్చజెబుతున్న హెచ్‌ఎం అబ్దుల్ కరీం

## సార్లు లేని బడిలో..
# పిల్లలను చేర్పించం

### బడి బాటను అడ్డుకున్న తల్లిదండ్రులు

రెంజల్, జూన్ 6: 'ఉపాధ్యాయులు లేని పాఠశాలలో చేర్పించి మా పిల్లల భవిష్యత్తును నాశనం చేసుకోబోం' అంటూ బడిబాట కార్యక్రమాన్ని తల్లిదండ్రులు అడ్డుకున్నారు. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తిలో బడిబాటలో భాగంగా ఇంటింటికీ తిరుగుతున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులను తల్లిందండ్రులు వేసిన ప్రశ్నలు ఉక్కిరిబిక్కిరి చేశాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కందకుర్తి జిల్లా పరిషత్ ఉర్దూ మీడియం పాఠశాల హెచ్‌ఎం అబ్దుల్ కరీం, ఉపాధ్యాయులతో కలిసి బడిబాటలో ఇంటింటికీ తిరుగుతూ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు వివరించారు. స్పందించిన పిల్లల తల్లిదండ్రులు హెచ్‌ఎంతో వాగ్వాదానికి దిగారు. 168 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఏమూలకు సరిపోతారని ప్రశ్నించారు. ప్రభుత్వం పాఠశాలల పునఃప్రారంభం నాటికి విద్యావలంటీర్లను నియమిస్తామని ప్రకటించినా ఊసేలేదని వాదనకు దిగడంతో బడిబాట కార్యక్రమాన్ని మధ్యలోనే ఆపేసి హెచ్‌ఎం, ఉపాధ్యాయులు వెనుదిరిగారు. ఇదిలా ఉండగా సంసద్ ఆదర్శ గ్రామ్ యోజన కింద 2015లో గ్రామాన్ని దత్తత తీసుకున్న అప్పటి ఎంపీ కల్వకుంట్ల కవిత 6వ తరగతి వరకు ఉన్న ఉర్దూ మీడియం పాఠశాలను 10వతరగతి వరకు అప్‌గ్రేడ్ చేయించారు. ఉపాధ్యాయుల భర్తీ చేయించడంలో పాలకుల నిర్లక్ష్యంతో విద్యార్థులకు శాపంగా మారింది. గతేడాది ఈ పాఠశాలలో 63 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు.

## కూలిన తరగతి గది గోడ

### తప్పిన ప్రమాదం

లింగంపేట(నాగిరెడ్డిపేట), జూన్ 6: లింగంపేట మండలం చెట్పల్లి సంగారెడ్డి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో గురువారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో తరగతి గదుల మరమ్మతుల చేపడుతుండగా అకస్మాతుగా గోడ కూలింది. నెల రోజులుగా పాఠశాలలో మరమ్మతు పనులు కొనసాగుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గురువారం అమావాస్య కావడంతో మేస్త్రీలు, కూలీలు పనులకు రాలేదు. పనులు చేపడుతుండగా గోడ కూలితే పరిస్థితి దారుణంగా ఉండేదని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. తరగతి గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని, మరమ్మతులు కాకుండా వాటిని తొలగించి నూతన గదులు నిర్మించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. అయినా పట్టించుకోకుండా తిరిగి వాటికే మరమ్మతులు చేయడంతో గోడ కూలిపోయిందని విమర్శించారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన గదులను పూర్తిగా తొలగించి కొత్తవాటిని నిర్మించాలని కోరుతున్నారు.



కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం చెట్పల్లి సంగారెడ్డి ఉన్నత పాఠశాలలో కూలిన తరగతి గది గోడ

- అధికారుల పర్యవేక్షణ లోపంతో నత్తనడక
- మరో ఐదు రోజుల్లో పాఠశాలల పునఃప్రారంభం
- గడువులోగా పూర్తయ్యేనా?

## పేరుకే ఆదర్శం
# పనులు ఆలస్యం

*అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన కనీస మౌలిక సదుపాయాల పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈనెల 12 నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్నది. ఈసారి తమ బడులు సరికొత్త హంగులతో స్వాగతం పలుకుతాయన్న సంబురంతో విద్యార్థులు రానున్నారు. కానీ .. అన్ని బడుల్లో ఆ పరిస్థితి కనిపించేలా లేదు. కొన్ని పాఠశాలల్లో మొండి గోడలు, పూర్తికాని గదులు, అరకొర మౌలిక వసతులే మళ్లీ స్వాగతం పలికేలా ఉన్నాయి. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు ఒక్కో దగ్గర ఒక్కోలా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1234 పాఠశాలలుండగా 790 పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం కింద ఎంపిక చేశారు.*

*– ఖలీల్‌వాడి, జూన్ 6*

### పాఠశాల పనులకు రూ.34 కోట్లు విడుదల

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట రూ.34 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధుల ద్వారానే పనులను చేపడుతున్నారు. పాఠశాలల్లో ప్రధానమైన సమస్యలను గుర్తించి వాటి పనులను వేగవంతంగా చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ పనులను పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ తోపాటు ఇతర శాఖల ద్వారా చేపడుతున్నట్లు తెలిసింది. ఒక వైపు ప్రభుత్వం నిధులు వెచ్చిస్తున్నప్పటికీ పలుచోట్ల పనులు నెమ్మదిగా సాగుతుండడం గమనార్హం.

### అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం

సర్కారు బడులపై అధికారుల పట్టింపు కరువైంది. గత ప్రభుత్వంలో తలపెట్టిన పనులు అటకెక్కాయి. కొత్త ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలలకు సరికొత్త హంగులు తేవాలనే ఉద్దేశంతో ఉన్నా... కొన్ని చోట్ల అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఎంపిక చేసిన పాఠశాలల్లో విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు, గదులకు తలుపులు, కిటికీలు, బెస్‌మెంట్‌తోపాటు కుర్చీలు, బెంచీలు అవసరం ఉంటుంది. కొన్ని పాఠశాలల్లో గోడలు దెబ్బతినడంతో వానకాలంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరికొన్నింటిలో పైకప్పులు కూడా శిథిలావస్థకు చేరాయి. వీటిని గుర్తించిన ప్రభుత్వం పనులను సక్రమంగా చేయాలని ఆదేశించింది. ఈ పనుల పర్యవేక్షణ కోసం అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసింది. అయితే పర్యవేక్షణ కొరవడి పనులు ముందుకు సాగడం లేదు. దీంతో పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి పనులు పూర్తవుతాయా అన్న సందేహం నెలకొన్నది. కొన్నిచోట్ల జిల్లా స్థాయి అధికారులు, అదనపు కలెక్టర్లు తనిఖీలు చేస్తుండడంతో పనులు సాగుతున్నాయి.



**త్వరలోనే పనులు పూర్తిచేస్తాం..**

ప్రతి పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్ల సమస్యలే ఎక్కువగా ఉన్నాయి. 12లోపు మౌలిక సదుపాయాలు పూర్తిచేస్తాం. పలు పాఠశాలల్లో గోడలు, పైకప్పులు దెబ్బతిన్నాయి. తలుపులు, కిటికీలు కూడా బాగోలేవు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు తర్వితగతిన చేపడుతున్నాం.

– ఎన్‌వీ దుర్గాప్రసాద్,
జిల్లా విద్యాశాఖాధికారి,
నిజామాబాద్

## గ్రూప్-1 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- వీసీలో టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

కామారెడ్డి, జూన్ 6: గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా అదనపు కలెక్టర్, పరీక్షల నోడల్ అధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్ రెడ్డి ఉన్నతాధికారులతో కలిసి జిల్లాల అదనపు కలెక్టర్లు, అదనపు ఎస్పీలు, పోలీసు నోడల్ అధికారులు, రీజినల్ కోఆర్డినేటర్లు, జాయింట్ కస్టోడియన్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా 9న నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలకు సంబంధించి చేపట్టాల్సిన విధి విధానాలపై జిల్లాల వారీగా సమీక్షించారు. అనంతరం కామారెడ్డి అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 4,797 మంది అభ్యర్థులు 12 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారని వెల్లడించారు. ఫస్ట్ ఎయిడ్ చికిత్సకు ఏఎన్‌ఎంలను నియమించామని, తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ రీజినల్ కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. వీసీలో అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, టీజీపీఎస్సీ రీజినల్ కోఆర్డినేటర్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి

## బుక్స్ విక్రయిస్తే అనుమతి రద్దు చేస్తాం

- డీఈవో దుర్గాప్రసాద్

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

ఖలీల్‌వాడి, జూన్ 6: ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్‌లు, షూస్ పేరిట మొదలైన వ్యాపారంపై మా దగ్గరే కొనాలి అనే శీర్షికన నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి డీఈవో దుర్గాప్రసాద్ స్పందించారు. ప్రైవేటు పాఠశాల ఆవరణలో బెల్టులు, యూనిఫామ్‌లు, పుస్తకాలు తదితర వాటి అమ్మకాలు చేపడితే చర్యలు తీసుకుంటామని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించే ముందు పాఠశాలకు ప్రభుత్వ అనుమతి ఉందో లేదో చూసుకొని అడ్మిషన్ తీసుకోవాలని సూచించారు. అవసరమైతే మండల విద్యాశాఖ అధికారిని సంప్రదించాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశాలు, వేసవి శిక్షణలు, పాఠశాల ఆవరణలో క్రయవిక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాల పేరిట విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద 70శాతం ఫీజును ముందే చెల్లించాలని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిసిందని, ఇలాంటి సంఘటనలు మా దృష్టికి వస్తే నోటీసులు జారీ చేయకుండానే పాఠశాల అనుమతులని రద్దు చేస్తామని హెచ్చరించారు.

## ఎంపీ ఫలితాలతో
# రేవంత్‌కు బుద్ధిరాలేదు

- ఆరు నెలల పాలనలో కాంగ్రెస్ ప్రజల విశ్వాసం కోల్పోయింది
- తెలంగాణ తల్లి ఉత్సవాలను ఖండిస్తున్నాం
- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

వినాయక్‌నగర్, జూన్ 6: సోనియా పుట్టిన రోజు సందర్భంగా డిసెంబర్ 9న నిర్వహించే తెలంగాణ తల్లి ఉత్సవాలను ఖండిస్తున్నామని, సోనియా మెప్పు కోసం సీఎం రేవంత్ తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాడని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మండిపడ్డారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలతో సీఎం రేవంత్ బుద్ధి తెచ్చుకొని ప్రవర్తిస్తారనుకుంటే మళ్లీ అవే అహంకారపు మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి, ప్రజలంతా ఏకమై బుద్ధి చెప్పినా ఆత్మ విమర్శ చేసుకోకుండా బీజేపీపైన ఏడవడం సరికాదని హెచ్చరించారు. 15స్థానాలు గెలుస్తామని బీరాలు పలికిన రేవంత్.. సొంత జిల్లాలో ఎంపీ,ఎమ్మెల్సీ స్థానాల ఓటమికి బాధ్యత వహించి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. చిహ్నాలు, గుర్తులు మార్చే శ్రద్ధ, పాలనపైన పెట్టి.. ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేస్తే బాగుంటుందన్నారు. మత రాజకీయాలతో ఓవర్గం మెప్పు కోసం తెలంగాణ అమరుల ఆశయాలు, ఆకాంక్షలు, ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టాలని చూస్తే ఊరుకోమని ధన్‌పాల్ హెచ్చరించారు.





సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా





## స్విమ్మింగ్..జోష్

**నిజామాబాద్** నగరంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ స్విమ్మింగ్ పూల్‌లో చిన్నారులు, యువకులు సందడి చేస్తున్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో స్విమ్మింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నారు. సుమారు 600మంది నిత్యం బృందాల వారీగా ఇక్కడ శిక్షణ తీసుకుంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

## పిడుగుపాటుతో పశువుల కాపరి మృతి

- గేదెలు మేపేందుకు వెళ్లి...

రెంజల్, జూన్ 6: మండలంలోని దండిగుట్ట తండాకు చెందిన పశువుల కాపరి బానోవత్ పీర్యానాయక్(85) పిడుగుపాటుతో మృతి చెందాడు. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కళ్యాపూర్ శివారులోని అలకుంట చెరువు వద్ద రోజూ మాదిరిగానే గురువారం పీర్యానాయక్ గేదెలు మేపుతున్నాడు. ఆకస్మాత్తుగా కురిసిన వర్షంతో తడవకుండా ఉండేందుకు దగ్గరలోని మామిడిచెట్టు కిందకు చేరుకున్నాడు. దీంతో పీర్యానాయక్‌పై ఒక్కసారిగా పిడుగుపడడంతో ఛాతికింది భాగంలో మంటలు అంటుకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని భార్య బూలీబాయి కోరారు.



పీర్యానాయక్ (ఫైల్)


నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం - మన పత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో అక్షర సమరం సాగించిన మన దినపత్రిక నమస్తే తెలంగాణ. బంగారు తెలంగాణ నిర్మాణంలోనూ తనదైన భూమికను పోషిస్తున్నది. ఇలాంటి చారిత్రక సందర్భంలో నమస్తే తెలంగాణ విలేకరిగా పని చేయాలనుందా..? అంకితభావంతో పాటు తెలుగుభాషా పరిజ్ఞానం, స్థానిక సమస్యలపై అవగాహన ఉన్నవారు పూర్తి బయోడేటాతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో రాత పరీక్షకు హాజరు కాగలరు.

: పరీక్ష తేదీ :

తేది: 07.06.2024, శుక్రవారం ఉ॥ 11.30

స్థలం: నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, పోలీస్ బెటాలియన్ వెనుక, డిచ్‌పల్లి, నిజామాబాద్

నిజామాబాద్ జిల్లాలో..
- ఎల్లమ్మగుట్ట • ముబారక్‌నగర్ • అర్సపల్లి • మోపాల్ • జక్రాన్‌పల్లి • కమ్మర్‌పల్లి • మెండోరా • సాలూరా

కామారెడ్డి జిల్లాలో..
- కలెక్టరేట్ • కామారెడ్డి టౌన్ • సదాశివనగర్ • లింగంపేట్ • తాడ్వాయి • పిట్లం • బీర్కూర్ • పాల్వంచ

వివరాలకు : 9182777737, 9182777155